ఎగిరిన ఎర్రజెండాలు

జిల్లా వ్యాప్తంగా గురువారం కార్మికులు మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాడవాడల ఆయా పార్టీల జెండాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. నల్లచట్టాలను రద్దు చేయాలని, కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్మికులు, ప్రజల కోసం పోరాడే కమ్యూనిస్టులు, ఎర్రజెండాను ప్రజాప్రతినిధులుగా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైన ఉందన్నారు. - సాక్షి నెట్‌వర్క్


మహబూబాబాద్‌లో..


గార్ల: ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు


కురవి: జెండా ఎగురవేస్తున్న నాయకులు


మహబూబాబాద్ అర్బన్‌లో..



గూడూరులో..



నెహ్రూసెంటర్‌లో..


మహబూబాబాద్ రూరల్: మాధవపురం గ్రామంలో..


దోర్నకల్‌లో..


కేసముద్రం: ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో..


పెద్దవంగర: పోచంపల్లి గ్రామంలో..


మరిపెడ రూరల్: ధారావత్‌తండాలో..


బయ్యారం: న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో..


నెల్లికుదురు: సీపీఎం ఆధ్వర్యంలో..

క్లుప్తంగా

ప్రభుత్వ భూముల సర్వే



దంతాలపల్లి: మండలంలోని కుమ్మరికుంట్ల, రేపోని, బొడ్లాడ పలుగ్రామాలలో ప్రభుత్వ భూములను తొర్రూరు ఆర్డీఓ గణేశ్ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ భూములను పరిశీలించి యువతకు ఉపాధి కల్పించేందుకు, పరిశ్రమల నిర్వహణ, అడవుల పెంపకం చేపట్టనుందన్నారు. అందులో భాగంగానే గ్రామాలలో ప్రభుత్వ భూముల సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు సునీల్‌కుమార్, సర్వేయర్ నిత్యశ్రీ,, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు డాక్టరేట్

బయ్యారం: బయ్యారానికి చెందిన ప్రజాకవి, రచయిత, సామాజిక ఉద్యమకారుడు కొమిరె వెంకన్న సాహిత్య, కళారంగంలో చేసిన కృషికిగాను డాక్టరేట్ పొందారు. న్యూ లైఫ్ థియోలాజికల్ యూనివర్సిటీ (కాలిఫోర్నియా గుర్తింపు సంస్థ) ఆధ్వర్యంలో గత నెల 30న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకన్నకు ప్రదానం చేశారు.

కార్యకర్తల సంక్షేమానికి కృషి చేస్తా..


చెక్కును అందజేస్తున్న దయాకర్‌రావు

పెద్దవంగర: బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని, వారి సంక్షేమానికి కృషి చేస్తానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త పిండి యాకయ్య ఇటీవల మృతి చెందాడు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల కోసం ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద ఇన్సూరెన్స్ చేయగా ప్రమాదవశాత్తు మృతి చెందిన యాకయ్య పేరిట రూ.2లక్షలు మంజూరు కాగా గురువారం మాజీ మంత్రి బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, నాయకులు, శ్రీరాం సంజయ్, సుధీర్, కనుకుంట్ల వెంకన్న, రాసాల సమ్మయ్య, కాసాని హరీశ్ పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి



మహబూబాబాద్ రూరల్: విద్యార్థులను ప్రోత్సహించాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని డీసీఆర్బీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎన్.నరేష్ కుమార్తె అక్షర పదో తరగతి పరీక్షల్లో 581 మార్కులు సాధించి జిల్లాలోనే 5వ స్థానంలో నిలవగా, అక్షరను ఎస్పీ అభినందించి సత్కరించారు.

కాంగ్రెస్ పోరాట ఫలితమే కులగణన

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ పోరాట ఫలితంగానే దేశవ్యాప్త కులగణన అని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. జనగణనతోపాటు కులగణన కూడా చేస్తామంటూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీసీ నేతలు గురువారం సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శంతన్ రామరాజు, పోతురాజు, పద్మం ప్రవీణ్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్


కేసముద్రం: నెట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. గురువారం మండలంలోని కల్వల జెడ్పీహైస్కూల్‌లో ఏర్పాటు చేసిన నెట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. అనంతరం పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన తేజస్విని, వెన్నెల, శివాణిలను ఆయన సన్మానించి, రూ.3వేల చొప్పున నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, గుగులోతు దస్రూనాయక్, బండారు వెంకన్న పాల్గొన్నారు. అదే విధంగా ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌లో వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

మున్సిపాలిటీ పరిధిలోని కేసముద్రంవిలేజ్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ కాశీ విశ్వేశ్వరాలయం, శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, శ్రీ సరస్వతిదేవి ఆలయాలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

చెక్కుల పంపిణీ

మహబూబాబాద్ రూరల్: కల్యాణలక్ష్మి పథకాన్ని తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రతిపాదించారని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భగవాన్ రెడ్డి, రామిరెడ్డి, నాగేశ్వర్ రావు, రమేశ్ పాల్గొన్నారు.

కష్టపడితే విజయాలు సాధ్యం


మహబూబాబాద్ అర్బన్: విద్యార్థినులను సన్మానిస్తున్న అధికారి దేశీరాం నాయక్

మహబూబాబాద్ అర్బన్: కష్టపడి చదివితే విజయం సాధ్యం అవుతుందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి గుగులోతు దేశీరాం నాయక్ అన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను గురువారం సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లలిత కుమారి, ఏసీఎంఓ రాములు నాయక్ పాల్గొన్నారు. ట్రైబల్ గురుకులంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆర్సీఓ హరిసంగ్ సన్మానించారు. డీసీఓ నారాయణనాయక్, ప్రిన్సిపాల్ గండి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజీ) జెడ్పీ హైస్కూల్‌లో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థి టి.రాజేష్‌ను మాజీ గ్రామ సర్పంచ్ జంగిలి హరిప్రసాద్, మాజీ వార్డు సభ్యులు జాఫర్‌ఖాన్ రాజు సన్మానించారు.

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విగ్నేష్ (565), ధనుంజయ్ (554), శివకుమార్ (534) ను గురువారం శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉప్పలయ్య, ఉపాధ్యాయులు రామసహాయం శ్రీధర్ రెడ్డి, కాసం శ్రీనువాసరావు, అల్లి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఎల్లంపేట జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురువారం ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు వీరందర్, నవీన్, ప్రసాద్, మల్లన్న, దయానంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం.. కేసు నమోదు



గూడూరు: ఓ బాలుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.గిరిధర్‌రెడ్డి గురువారం తెలిపారు. మండలంలోని చిన్న ఎల్లాపురం శివారు లక్ష్మణ్‌తండాకు చెందిన వాంకుడోతు జాన్‌పాల్ అనే 6సంవత్సరాల బాలుడు, తండ్రి వాంకుడోతు కృష్ణమూర్తి కలిసి ఆదివారం ఆటోలో సమీపంలోని పేట గ్రామానికి వెళ్లారు. అర్ధరాత్రి తండ్రి ఆటోలో బాలుడిని తీసుకొని వస్తూ, మార్గమధ్యలో నిద్రవస్తుందని, ఆటో నిలిపి పడుకున్నారు. తెల్లవారు జామున లేచి తండ్రి చూడగా, ఆటోలో బాలుడు జాన్‌పాల్ కనిపించలేదు. దీంతో వెంటనే స్వగ్రామం, సొంత ఇల్లు, బంధువులు ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ విషయమై బాలుడి తండ్రి కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు 96768 99537, 87126 56963, 87126 56962, 87126 56960 నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు.

ప్రమాదవశాత్తు గడ్డి దగ్ధం

కురవి: మండలంలోని మోద్గులగూడెం గ్రామంలో గురువారం ట్రాక్టర్‌లో గడ్డిని లోడ్ చేసుకుని ఊరిలోకి వస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి గడ్డి దగ్ధమైన సంఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మోద్గులగూడెం గ్రామానికి చెందిన వల్లపు వీరన్న అనే రైతుకు చెందిన వరిగడ్డిని పొలం నుంచి అదే గ్రామానికి చెందిన ఐలి వీరేందర్ తన ట్రాక్టర్‌లో తీసుకుని ఊరిలోకి వస్తున్నాడు. ఊరిలోకి వస్తున్న సమయంలో విద్యుత్‌తీగలు గడ్డికి తగిలి దగ్ధమైంది. గడ్డి కాలుతున్న క్రమంలో డ్రైవర్ ట్రాక్టర్ డబ్బాను పైకి లేపడంతో గడ్డి కిందపడిపోయింది. ట్రాక్టర్ డబ్బా పాక్షికంగా దెబ్బతింది.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి



కొత్తగూడ: విద్యుదాఘాతానికి మూడు పాడి గేదెలు మృతి చెందిన సంఘటన మండలంలోని ఓటాయి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు పొలాల్లోని 11కేవీ విద్యుత్ వైర్ తెగి కింద పడింది. అది ఎవరు గమనించలేదు. మేతకు వెళ్లిన పాడి గేదెలు తిరిగి ఇంటికి వచ్చే సమయంలో కింద పడిన వైర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఇంటి పన్నులో 5శాతం రాయితీ

తొర్రూరు: మున్సిపాలిటీలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్నును ముందస్తుగా చెల్లించే వారికి 5శాతం రాయితీ అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ తెలిపారు. ఈ అవకాశం ఈనెల 7వరకు ఉందని, పట్టణ వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

పెద్దవంగర: విద్యార్థులు వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బుదారపు శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో వేసవి శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ కంచెర్ల ప్రభాకర్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రాజలింగం, ఉపాధ్యాయులు సదయ్య, తక్కి పాషా, హైమ పాల్గొన్నారు.

సంబురాలు

నెహ్రూసెంటర్: అంగన్‌వాడీ యూనియన్, సీఐటీయూ పోరాటాల ఫలితంగానే అంగన్‌వాడీ స్కూళ్లకు వేసవి సెలవులు ప్రకటించారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దార స్నేహబిందు అన్నారు. వేసవి సెలవులు ప్రకటించడంతో సంఘం కార్యాలయంలో సంబురాలను నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో నాగన్న, సీతారాంనాయక్, రాజమౌళి, స్వరూప, శైలజ, దుర్గా పాల్గొన్నారు.

అండగా ప్రభుత్వం

చిన్నగూడూరు: మండలంలోని గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన ఒంటెల కిరణ్ కొద్ది సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై మంచానికే పరిమితమై దీనస్థితిలో ఉంటున్నాడు. గురువారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరామర్శించి, ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ప్రభుత్వం తరఫున సహాయం అందే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బిల్లుల కోసం ఎదురుచూపులు

- అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేపట్టిన మాజీ సర్పంచ్‌లు
- పదవీ ముగిసి రెండేళ్లైనా నిధులు రాలేదని ఆవేదన


గూడూరు: సొంత ఖర్చులతో వేసిన సీసీ రోడ్డును చూపుతున్న మాజీ సర్పంచ్

గూడూరు: గ్రామాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కొందరు, రాజకీయాలపై వ్యామోహంతో ఇంకొందరు, వారసత్వ రాజకీయాలతో మరికొందరు వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని గత ప్రభుత్వ పాలనలో సర్పంచ్‌లుగా పోటీ చేసి ఎన్నికయ్యారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో నిధులు మంజూరు కాకపోయినప్పటికీ, బయట నుంచి అప్పులు తెచ్చి మరీ అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశారు. కానీ అభివృద్ధి లక్ష్యంగా పనిచేసిన వారికి చివరకు అప్పులే మిగిలాయి. 2022, 2023లో గత ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని ఒత్తిడి తీసుకొచ్చింది. దీంతో గత్యంతరం లేక నాటి సర్పంచ్‌లు బయట నుంచి అప్పులు తీసుకొచ్చి, ఒక్కొక్క గ్రామపంచాయతీలో సుమారు రూ.10నుంచి రూ.30లక్షల వరకు పనుల పూర్తి చేసి బిల్లుల రాక కోసం ఎదురు చూస్తున్నారు. రెండేళ్లు గడిచినప్పటికీ గత రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయలేదు. బంగారం, భూములు అమ్ముకొని అప్పులు కట్టాల్సిన పరిస్థితులు ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు.

పదవీ కాలం ముగిసినా..

జిల్లాలోని 16 మండలాల్లో 461 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో ప్రభుత్వం నుంచి స్టేట్ ఫైనాన్స్, 15వ ఆర్థిక సంఘం నిధులు రావాల్సి ఉంది. వీటితోపాటు మన ఊరు–మన బడి పథకంలో భాగంగా చేపట్టిన పనులకు సైతం బిల్లులు రావాల్సి ఉంది. ఈలోగా ఫిబ్రవరి 2వ తేదీ 2024తో వారి పదవీ కాలం కాస్త ముగిసింది. ఆ తరువాత ప్రభుత్వం గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించింది. కానీ తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని, అప్పటి వరకు తమ పదవీకాలం పొడగించాలని విజ్ఞప్తి చేసినా వినిపించుకోలేదు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ ఎస్డీఎఫ్ నిధులు మంజూరు చేస్తామని చెప్పి, మంజూరు చేయలేదని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు విడుదల చేయాలి



గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో అప్పులు తెచ్చి పనులు పూర్తి చేశా. రెండేళ్లుగా నాకు రావాల్సిన రూ.కోటి 20లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. తెచ్చిన డబ్బులకు వడ్డీల మీద వడ్డీ కట్టలేకపోతున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి.

- రమేష్‌నాయక్, మాజీ సర్పంచ్

బిల్లులు రాగానే అందజేస్తాం..



గ్రామాల్లో మాజీ సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనులపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపాం. గత రెండేళ్లుగా ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే, మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు అందజేస్తాం.

- హరిప్రసాద్, డీపీఓ

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ

దోర్నకల్: గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానికులు సహకరించాలని దోర్నకల్ సీఐ బి.రాజేష్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని తహసీల్దారు బంజర గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం సీఐ ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుతో శాంతి భద్రతల పరిరక్షణ సులువవుతుందన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, నిర్వహణలో స్థానికులు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై గడ్డం ఉమ, పోలీసు అధికారి లత, నాయకులు అయోధ్య రామయ్య, బొల్లం ఐలయ్య, రాఘవరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్లు, బ్రహ్మరెడ్డి, హరీశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వాలపై ప్రజల్లో అసంతృప్తి


స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న నాగయ్య

కేసముద్రం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.నాగయ్య విమర్శించారు. గురువారం ఇనుగుర్తి మండల కేంద్రంలో ఆవుల వెంకన్న స్మారక స్థూపాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వాల తీరుతో రైతులు, అసంఘటితరంగ కార్మికులు, వ్యవసాయ కూలీలు అన్నిరంగాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆవుల వెంకన్న కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, రాజన్న, పాపారావు, వెంకన్న, యాకూబ్‌రెడ్డి, కిషన్, శ్రీశైలం పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పాలాభిషేకం



తొర్రూరు: కుల గణన చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పైండ్ల రాజేష్ అన్నారు. ఈ మేరకు బీజేపీ ఆధ్వర్యంలో గురువారం డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు పల్లె కుమార్, రవిబాబు, సురేష్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉచిత కంటి ఆపరేషన్లపై రివ్యూ

చిన్నగూడూరు: చిన్నగూడూరు క్యాంపు నుంచి ఉచిత కంటి ఆపరేషన్ చేయించుకున్న వారందరు నేడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రగతి సేవా సమితి ఆధ్వర్యంలో కంటి చూపుపై రివ్యూ ఉంటుందని జిల్లా కోఆర్డినేటర్ ఐనాల పరశురాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.00గంటల నుంచి మధ్యాహ్నం 11.30ల వరకు సకాలంలో వచ్చి చూపించుకోవాలని కోరారు.

అన్నదానం

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, సీతామహలక్ష్మీ దంపతుల కుమారుడు సూర్యచంద్ర పుట్టినరోజు సందర్భంగా, శ్రీ సూర్యచంద్ర శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహరాజ్ ట్రస్టు మహబూబాబాద్ ఆధ్వర్యంలో మహాఅన్నదాన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.

ఆర్థికసాయం

తొర్రూరు రూరల్: మండలంలోని గోపాలగిరి గ్రామంలో ఇటీవల వడదెబ్బతో మృతి చెందిన యనమాల సారయ్య కుటుంబాన్ని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో పరామర్శించి, మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, రూ.5వేల నగదును గురువారం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ప్రదీప్‌రెడ్డి, ధర్మారపు కిరణ్, రాయిశెట్టి వెంకన్న పాల్గొన్నారు.

ఫ్లెక్సీతో విద్యుత్ సరఫరాకు అంతరాయం

దోర్నకల్: దోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని బైపాస్ రోడ్డులో భారీ గాలులతో ఫ్లెక్సీ విద్యుత్ తీగలపై పడడంతో రెండు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బుధవారం అర్ధరాత్రి బైపాస్ రోడ్డులో షాపింగ్ కాంప్లెక్స్‌పై ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్‌కు సంబంధించిన ఫ్లెక్సీ భారీ గాలులతో పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

హరిప్రియ జన్మదిన వేడుకలు

గార్ల: గార్లలో మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ జన్మదిన వేడుకలను గురువారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేశ్, ఎండి ఫహీయొద్దీన్, యాకూబ్‌పాషా, వెంకట్ పాల్గొన్నారు.

బియ్యం అందజేత

మరిపెడ రూరల్: మరిపెడ మండలం ఉల్లెపల్లి గ్రామానికి చెందిన వనగండ్ల లక్ష్మణ్ (30) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకుడు బొడ్డు వెంకన్న ఆధ్వర్యంలో 50కిలోల బియ్యం, రూ.3వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

ఎమ్మెల్యే మురళీనాయక్ పరామర్శ

కేసముద్రం: మండలంలోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన సట్ల లక్ష్మీ బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ మేరకు మహబూబాబాద్ ఎమ్మెల్యే భుక్య మురళీనాయక్ గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు.

శంకర్‌నాయక్ పరామర్శ

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామానికి చెందిన కూన సరోజన అనారోగ్యంతో మృతి చెందింది. ఈమేరకు మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు.